# Visit of Foreign Secretary to Afghanistan (February 28-29 2020)

February 29, 2020

# విదేశాంగ కార్యదర్శి ఆఫ్ఘానిస్థాన్ పర్యటన (ఫిబ్రవరి 28-29, 2020)

ఫిబ్రవరి 29, 2020

1. విదేశాంగ కార్యదర్శి శ్రీ హర్ష వర్ధన్ శృంగ్లా ఫిబ్రవరి 28-29, 2020న ఆఫ్ఘానిస్థాన్‌లో పర్యటించారు. నెల క్రితం భారత విదేశాంగ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇది తెలియజేస్తుంది.

2. ఈ పర్యటన సందర్భంగా అధ్యక్షుడు డా.అష్రాఫ్ ఘని, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా.అబ్దుల్లా అబ్దుల్లా, మాజీ అధ్యక్షుడు శ్రీ హమీద్ కర్జాయ్‌తో విదేశాంగ కార్యదర్శి భేటీ అయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీ అమ్రుల్లా సలెహ్, ఎన్ఎస్ఎ డా.హమ్దుల్లా మొహిబ్, తాత్కాలిక విదేశాంగ మంత్రి శ్రీ మహమ్మద్ హరూన్ చకాన్సూరి, తాత్కలిక ఆర్థిక మంత్రి శ్రీ అబ్దుల్ జద్రాన్‌తోనూ సమావేశమయ్యారు. అంతే కాదు ఆఫ్ఘన్ రాజకీయ, మీడియా, పౌరసమాజం, మేధావులు సహ వివిధ వర్గాల నాయకులతోనూ ఆయన వేర్వేరుగా మాట్లాడారు.

3. ఆఫ్ఘన్ నాయకత్వంతో జరిపిన సమావేశాల్లో వ్యూహాత్మక భాగస్వాములైన రెండు పొరుగుదేశాల మధ్య రాజకీయ, ఆర్థిక, అభివృద్ధి మైత్రిని పెంపొందించేందుకు భారత్ కట్టుబడి ఉందని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. ఆఫ్ఘన్ సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే స్వతంత్ర, సార్వభౌమ, ప్రజాస్వామ్య, భిన్నత్వ ఆఫ్ఘానిస్థాన్‌కు భారత్ నుంచి స్థిరమైన మద్దతు లభిస్తుందని ఆయన మరో మారు తెలిపారు. ఆఫ్ఘన్ నేతృత్వంలో, ఆఫ్ఘన్ సొంతంగా, ఆఫ్ఘన్ నియంత్రణలో శాంతి, సయోధ్య ప్రక్రియకు భారత్ చేయూత ఉంటుందని ఆయన వెల్లడించారు. ఆఫ్ఘానిస్థాన్‌లో సుస్థిరమైన

శాంతి కోసం బయటి నుంచి ప్రాయోజితమవుతున్న తీవ్రవాదానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని ఆయన తేల్చిచెప్పారు.

4. నాలుగో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించి తుది ఫలితాన్ని ప్రకటించినందుకు ఆప్ఘానిస్థాన్ ప్రభుత్వాన్ని విదేశాంగ కార్యదర్శి అభినందించారు. తాజా పరిణామాలతో శాంతి వెల్లివిరుస్తుందనే ఆశ ఏర్పడుతోందని, దేశ ప్రజల శాంతిభద్రతల కోసం అన్ని వర్గాల రాజకీయ నాయకత్వం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు.

5. ఆఫ్ఘానిస్థాన్ శ్రేయస్సు, శాంతి, అభివృద్ధి కోసం భారత్ అందిస్తున్న చేయూతను ఆప్ఘానిస్థాన్ నాయకత్వం ప్రశంసించింది. చాహ్‌బహార్ రేవును ఉపయోగంలోకి తీసుకురావడం, భారత్- ఆఫ్ఘానిస్థాన్‌లోని వివిధ నగరాల మధ్య ఏయిర్ ఫ్రైట్ కారిడర్ వంటి ప్రాంతీయ అనుసంధానం కోసం చేస్తున్న కృషిని కొనియాడింది. ఈ పర్యటన సందర్భంగా భారత్ అందిస్తున్న అభివృద్ధి సాయంలో భాగంగా చేపడుతున్న బమ్యాన్, మజార్-ఏ-షరీఫ్ రోడ్డు ప్రాజెక్టు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. కొత్త అభివృద్ధి భాగస్వామ్యాన్ని అమలు చేసేందుకు కలిసికట్టుగా పనిచేస్తూ వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందానికి అనుగుణంగా సహకారాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని అంగీకరించడమైనది.

**కాబూల్**
**ఫిబ్రవరి 29, 2020**

DISCLAIMER : This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.